భారత జట్టులోకి ఏపీ క్రికెటర్

# నితీశ్ వచ్చేశాడు..

**ఐపీఎల్ హీరోలకు అందలం .. జింబాబ్వే టూర్‌కు కెప్టెన్‌గా గిల్**



"భారత క్రికెట్ జట్టులో చోటు దక్కించుకోవడం చాలా గర్వంగా ఉంది. నాన్నకు కూడా సంతోషం. కానీ 50 శాతమే నా కల నెరవేరింది. జెర్సీ ధరించి దేశం తరపున మ్యాచ్ గెలిపించినప్పుడే వంద శాతం నా స్వప్నం సాకారమైనట్లు. ఒకప్పుడు నా ప్రతిభను తక్కువ అంచనా వేసిన వాళ్ల కండ్లలో నా తండ్రికి ఇచ్చే గౌరవం చూడాలని ఉంది. ఐపీఎల్‌లో కమిన్స్, క్లాసెన్, భువనేశ్వర్ నాకు విలువైన సలహాలు, సూచనలు ఇచ్చారు. పరిస్థితులకు అనుగుణంగా ఎలా రాణించాలో ఐపీఎల్ ద్వారా నేర్చుకున్నాను.

ముంబై: ఇటీవలే ముగిసిన ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)లో అదరగొట్టిన కుర్రాళ్లకు జాతీయ జట్టు నుంచి పిలుపు వచ్చింది. సీనియర్ల గైర్హాజరీలో సెలెక్టర్లు ఈ పర్యటనలో పలువురు ఐపీఎల్ హీరోలకు అవకాశమిచ్చారు. సన్‌రైజర్స్ హైదరాబాద్ ఆడుతూ సీజన్ ఆసాంతం ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టిన తెలుగు క్రికెటర్ నితీశ్ రెడ్డితో పాటు ఎస్‌ఆర్‌హెచ్ ఓపెనర్ అభిషేక్ శర్మ, రాజస్థాన్ యువ ఆల్‌రౌండర్ రియాన్ పరాగ్, చెన్నై బౌలర్ తుషార్ దేశ్‌పాండేకు చోటు దక్కింది. ఈ మేరకు సోమవారం భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) 15 మంది సభ్యులతో కూడిన జట్టును ప్రకటించింది. ఈ జట్టుకు యువ ఓపెనర్ శుభ్‌మన్ గిల్ సారథ్యం వహించనున్నాడు. జింబాబ్వే పర్యటనకు వెళ్లనున్న భారత జట్టులో ప్రస్తుతం టీ20 వరల్డ్ కప్‌లో ఉన్న ఆటగాళ్లలో జైస్వాల్, శాంసన్ మినహా అందరికీ విశ్రాంతి ఇచ్చారు. ఈ పర్యటనలో యువ భారత్.. జింబాబ్వేతో ఐదు టీ20లు ఆడనుంది. జూలై 6 నుంచి 14వ తేదీ వరకు సిరీస్ జరుగుతుంది.

**భారత జట్టు:**
శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), నితీశ్ రెడ్డి, యశస్వీ జైస్వాల్, రుతురాజ్ గైక్వాడ్, అభిషేక్ శర్మ, రింకూ సింగ్, సంజూ శాంసన్, ధ్రువ్ జురెల్, రియాన్ పరాగ్, వాషింగ్టన్ సుందర్, రవి బిష్ణోయ్, అవేశ్ ఖాన్, ఖలీల్ అహ్మద్, ముఖేష్ కుమార్, తుషార్ దేశ్‌పాండే

## పారిస్‌కు అదితి, దీక్ష అర్హత



న్యూఢిల్లీ: ప్రతిష్ఠాత్మక పారిస్ ఒలింపిక్స్‌కు భారత యువ గోల్ఫర్లు అదితి అశోక్, దీక్షా దాగర్ అర్హత సాధించారు. ప్రస్తుత ప్రపంచ ర్యాంకింగ్స్‌ను పరిగణనలోకి తీసుకుంటూ విశ్వక్రీడలకు సోమవారం బెర్తులు ప్రకటించారు. నిలకడగా రాణిస్తున్న అదితికి ఇది మూడో ఒలింపిక్స్ కాగా, దీక్షకు ఇది రెండోది. గత ఒలింపిక్స్(టోక్యో)లో అదితి నాలుగో స్థానంలో నిలిచి తృటిలో పతక అవకాశాన్ని చేజార్చుకుంది. మరోవైపు పురుషుల విభాగంలో భారత్ నుంచి శుభాంకర్ శర్మ, గగన్‌జీత్ భుల్లార్ ఇప్పటికే పారిస్ ఒలింపిక్స్‌కు బెర్తు దక్కించుకున్న సంగతి తెలిసిందే.

## త్వరలో హెచ్‌సీఏ ఓపెన్ సెలెక్షన్స్

హైదరాబాద్, ఆట ప్రతినిధి: ఉమెన్స్ లీగ్ కోసం వర్ధమాన మహిళా క్రికెటర్లను ఎంపిక చేసేందుకు హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్‌సీఏ) సిద్ధమైంది. ఇందు కోసం ఈనెల 29, 30 తేదీల్లో ఓపెన్ సెలెక్షన్స్ నిర్వహించనున్నట్లు హెచ్‌సీఏ కార్యదర్శి దేవ్‌రాజ్ సోమవారం వెల్లడించారు. ఉప్పల్ స్టేడియం వేదికగా ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు సెలెక్షన్స్ జరుగుతాయని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న క్రికెటర్లు సోమవారం నుంచి www.hyc.cricket.in అనే వెబ్‌సైట్లో తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు.

# రోహిత్ ధమాకా

**ధనాధన్ ఇన్నింగ్స్‌తో విజృంభణ • ఆస్ట్రేలియాపై భారత్ ఘన విజయం**

**సెమీస్‌లోకి టీమ్‌ఇండియా • భయపెట్టిన ట్రావిస్ హెడ్ • అఫ్గాన్ చేతిలో ఆసీస్ సెమీస్ బెర్తు!**



రోహిత్ (92)

**1** అంతర్జాతీయ టీ20ల్లో 150 విజయాలు సాధించిన తొలి జట్టుగా భారత్ నిలిచింది.

**1** టీ20ల్లో 200 సిక్స్‌లు కొట్టిన తొలి బ్యాటర్‌గా రోహిత్ (203) ముందున్నాడు. మార్టిన్ గప్టిల్ (173)ది ఆ తర్వాత స్థానం

**ఆస్ట్రేలియాపై భారత్ కసితీరా ప్రతీకారం తీర్చుకుంది. ఐసీసీ మెగాటోర్నీల్లో తమకు కొరకరాని కొయ్యగా మారిన కంగారూల పీక మణుస్తూ విజయదుందుభి మోగించింది. సమిష్టి ప్రదర్శనతో సత్తాచాటుతూ సగర్వంగా సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. అపజయమెరుగని టీమ్‌ఇండియా గ్రూపు–1లో అగ్రస్థానంతో డిఫెండింగ్ చాంపియన్ ఇంగ్లండ్‌తో అమీతుమీకి సిద్ధమైంది. రోహిత్‌శర్మ 'హిట్‌మ్యాన్' ఇన్నింగ్స్‌తో ఆసీస్‌ను కంగారెత్తించాడు. స్టార్ పేసర్ స్టార్క్‌ను చీల్చిచెండాడుతూ రోహిత్ కొట్టిన సిక్స్‌లకు స్టేడియం హోరెత్తిపోయింది. కోహ్లీ విఫలమైనా ఆ ప్రభావం కనిపించకుండా కెప్టెన్ ఇన్నింగ్స్‌తో కదంతొక్కగా, సూర్యకుమార్, దూబే, పాండ్యా దంచుడుతో భారత్ భారీ స్కోరు అందుకుంది. లక్ష్యఛేదనలో హార్డ్‌హిట్టర్ వార్నర్ ఆదిలోనే నిష్క్రమించినా..ట్రావిస్ హెడ్ సుడిగాలి ఇన్నింగ్స్‌తో మరోమారు భయపెట్టే ప్రయత్నం చేశాడు. కానీ అర్ష్‌దీప్‌సింగ్, కుల్దీప్ విజృంభణతో ఆసీస్ గెలుపు వాకిట బోల్తా కొట్టింది. తాజా ఓటమితో సెమీస్ రేసు నుంచి ఆసీస్ అనధికారికంగా నిష్క్రమించినట్టే! బంగ్లాదేశ్–అఫ్గానిస్థాన్ మధ్య జరిగే మ్యాచ్‌లో కాబూలీలు విజయం సాధిస్తే కంగారూల కథ కంచికే చేరినట్లే అవుతుంది.**

సెయింట్‌లూసియా: గత రెండు ఐసీసీ టోర్నీ (డబ్ల్యూటీసీ, వన్డే వరల్డ్ కప్ ఫైనల్స్)లలో భారత 'కప్పు కల'ను అడ్డుకున్న ఆస్ట్రేలియాపై టీమ్‌ఇండియా బదులు తీర్చుకుంది. సెమీస్ రేసులో నిలవాలంటే ఆ జట్టుకు అత్యంత కీలకమైన మ్యాచ్‌లో కంగారూలను 24 పరుగుల తేడాతో ఓడించింది. సెయింట్‌లూసియా వేదికగా ఇరు జట్ల మధ్య సాగిన 'హై స్కోరింగ్ థ్రిల్లర్'లో భారత్‌దే పైచేయి అయింది. చాలా కాలం తర్వాత భారత సారథి రోహిత్ శర్మ (41 బంతుల్లో 92, 7 ఫోర్లు, 8 సిక్సర్లు) తనలోని 'హిట్‌మ్యాన్'ను బయటకు తీసి ధనాధన్ ఇన్నింగ్స్ ఆడటంతో మొదట బ్యాటింగ్ చేసిన భారత్ 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 205 పరుగుల భారీ స్కోరు సాధించింది. సూర్యకుమార్ యాదవ్ (16 బంతుల్లో 31, 3 ఫోర్లు, 2 సిక్సర్లు), హార్దిక్ పాండ్యా (17 బంతుల్లో 27 నాటౌట్, 1 ఫోర్, 2 సిక్సర్లు) వేగంగా ఆడారు. భారీ ఛేదనలో ఆస్ట్రేలియా దీటుగానే బదులిచ్చింది. ట్రావిస్ హెడ్ (43 బంతుల్లో 76, 9 ఫోర్లు, 4 సిక్సర్లు) మరోసారి భారత్ పాలిట విలన్‌గా మారినా చివర్లో మన బౌలర్లు రాణించి ఆసీస్‌ను దెబ్బకొట్టడంతో ఆ జట్టు నిర్ణీత ఓవర్లలో 181/7కే పరిమితమైంది. రోహిత్‌కే 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు దక్కింది.

### హిట్‌మ్యాన్ షో..

టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన భారత్ రెండో ఓవర్లోనే కోహ్లీ(0) వికెట్ కోల్పోయింది. హెజిల్‌వుడ్ వేసిన షాట్ బాల్‌ను ఆడబోయిన కోహ్లీ టిమ్ డేవిడ్ వెనక్కి పరుగెడుతూ క్యాచ్ అందుకోవడంతో మరోసారి డకౌట్ అయ్యాడు. కానీ ఆ తర్వాతి ఓవర్ నుంచే మొదలైంది అసలు కథ. స్టార్క్ వేసిన మూడో ఓవర్లో రోహిత్ 6, 6, 4, 6, 6 తో 29 పరుగులు పిండుకుని ఈ మ్యాచ్‌లో తన విధ్వంసం ఎలా ఉండనుందో చెప్పకనే చెప్పాడు. ఆరో ఓవర్లో రోహిత్ బాదుడుకు బలైంది కమిన్స్. ఓ సిక్సర్, రెండు బౌండరీలతో 15 రన్స్ రాబట్టిన హిట్‌మ్యాన్ 19 బంతుల్లోనే అర్ధ సెంచరీ పూర్తిచేశాడు. 5 ఓవర్లలో భారత్ స్కోరు 52–1 గా ఉంటే అందులో రోహిత్‌వే 50 రన్స్ కావడం విశేషం. మార్ష్ వ్యూహం మార్చి జంపాకు బంతినిచ్చినా రోహిత్ రెండు సిక్సర్లతో అతడికి స్వాగతం పలికాడు. స్టోయినిస్ 8వ ఓవర్లో మూడో బంతికి డీప్ బ్యాక్‌వర్డ్ స్క్వేర్ మీదుగా కొట్టిన సిక్సర్‌ను అయితే చూసి తీరాల్సిందే. ఇదే ఓవర్లో షాట్ ఆడబోయిన పంత్ (15) హెజిల్‌వుడ్‌కు క్యాచ్ ఇవ్వడంతో 87 పరుగుల రెండో వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది.

### సూర్య, హార్దిక్ దూకుడు..

పంత్ వెనుదిరిగినా అతడి స్థానంలో వచ్చిన సూర్యతో కలిసి రోహిత్ వేగంగా ఆడటంతో రన్‌రేట్ ఓవర్‌కు 10.5కు తగ్గకుండా పరుగులు పెట్టింది. అయితే 90లలోకి వచ్చిన రోహిత్.. 12వ ఓవర్లో స్టార్క్ వేసిన యార్కర్ లెంగ్త్ డెలివరీని ఆడబోయి అది కాస్తా మిస్ అయి వికెట్లను తాకడంతో శతకానికి 8 పరుగుల దూరంలో ఔట్ అయ్యాడు. రోహిత్ పెవిలియన్ చేరాక కాసేపటికే సూర్య సైతం ఆఫ్‌సైడ్‌కు ఆవలగా వెళ్తున్న బంతిని ఆడబోయి కీపర్ మాథ్యూవేడ్‌కు క్యాచ్ ఇచ్చాడు. ఆఖర్లో దూబె (28), హార్దిక్ దూకుడుతో భారత్ 200 పరుగుల మార్కును దాటింది.

**సంక్షిప్త స్కోర్లు:**
**భారత్:** 20 ఓవర్లలో 205/5 (రోహిత్ 92, సూర్య 31, స్టార్క్ 2/45, స్టోయినిస్ 2/56). **ఆస్ట్రేలియా:** 20 ఓవర్లలో 181/7 (హెడ్ 76, మార్ష్ 37, అర్ష్‌దీప్ 3/37, కుల్దీప్ 2/24)

### మళ్లీ అతడే..!

భారీ ఛేదనలో ఆసీస్ మొదటి ఓవర్లోనే డేవిడ్ వార్నర్ (6) వికెట్ కోల్పోయింది. కానీ ఐసీసీ టోర్నీలలో 'భారత్‌కు విలన్'గా మారిన ట్రావిస్ హెడ్ మరోసారి రెచ్చిపోయాడు. ఆసీస్ సారథి మిచెల్ మార్ష్ (37) తో కలిసి భారత బౌలర్లపై ఎదురుదాడికి దిగాడు. అర్ష్‌దీప్ 3వ ఓవర్లో మార్ష్ ఇచ్చిన రిటర్న్ క్యాచ్‌ను వదిలేయడంతో అతడికి లైఫ్ దక్కింది. అదే ఓవర్లో అతడు 4,6 కొట్టాడు. ఇక బుమ్రా వేసిన 4వ ఓవర్లో హెడ్ 3 బౌండరీలతో బాదుడుకు శ్రీకారం చుట్టాడు. హార్దిక్‌ను లక్ష్యంగా చేసుకున్న హెడ్.. అతడి బౌలింగ్‌లో భారీ షాట్లతో విరుచుకుపడ్డాడు. కుల్దీప్ 9వ ఓవర్లో మార్ష్ ఇచ్చిన క్యాచ్‌ను బౌండరీ లైన్ వద్ద అక్షర్ అద్భుతంగా అందుకోవడంతో 81 పరుగులు రెండో వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. హార్దిక్ 9వ ఓవర్లో 3 ఫోర్లతో హెడ్ 24 బంతుల్లోనే అర్ధ సెంచరీ పూర్తిచేశాడు. ఉన్నంతసేపు మెరుపులు మెరిపించిన మ్యాక్స్‌వెల్ (20)ను కుల్దీప్ బౌల్డ్ చేశాడు. స్టోయినిస్ (2)ను అక్షర్ బోల్తా కొట్టించాడు.

### బ్రేక్ ఇచ్చిన బుమ్రా

ఆసీస్‌ను లక్ష్యం దిశగా తీసుకెళ్తున్న హెడ్‌ను ఆపేందుకు రోహిత్ వ్యూహం మార్చి బుమ్రాకు బంతినందించాడు. 17వ ఓవర్లో బుమ్రా వేసిన మూడో బంతిని షాట్ ఆడబోయినా అది మిస్ అయినా కవర్స్‌లో రోహిత్ మాత్రం క్యాచ్‌ను మిస్ చేయలేదు. తర్వాతి ఓవర్లోనే వేడ్ (1)తో పాటు ప్రమాదకర టిమ్ డేవిడ్ (15)ను అర్ష్‌దీప్ ఔట్ చేయడంతో ఆసీస్ ఓటమి ఖరారైంది.

**పాయింట్ల పట్టిక (గ్రూపు-1)**

| జ | ఆ | గె | ఓ | ర.రే | పా |
|---|---|---|---|---|---|
| భారత్ | 3 | 3 | 0 | +2.01 | 6 |
| ఆస్ట్రేలియా | 3 | 1 | 2 | -0.33 | 2 |
| అఫ్గానిస్థాన్ | 2 | 1 | 1 | -0.65 | 2 |
| బంగ్లాదేశ్ | 2 | 0 | 2 | -2.48 | 0 |

నోట్: జ: జట్లు, ఆ: ఆడినవి, గె: గెలిచినవి, ఓ: ఓడినవి, ర.రే: రన్‌రేట్, పా: పాయింట్లు



# సెమీస్‌కు సఫారీలు

**ఉత్కంఠ పోరులో విండీస్ ఓటమి**

నార్త్‌సౌండ్ (అంటిగ్వా): స్వదేశంలో టీ20 ప్రపంచకప్‌ను ముచ్చటగా మూడోసారి ముద్దాడాలనుకున్న వెస్టిండీస్‌కు దక్షిణాఫ్రికా షాకిచ్చింది. సెమీస్ చేరాలంటే తప్పక నెగ్గాల్సిన మ్యాచ్‌లో చివరి ఓవర్‌దాకా పోరాడి ఓడింది. అంటిగ్వా వేదికగా పలుమార్లు వర్షం అంతరాయం కలిగించిన ఈ మ్యాచ్‌లో బ్యాటింగ్‌లో విఫలమైనా బంతితో చేయగలిగినంత చేసినా ఆ జట్టుకు ఓటమి తప్పలేదు. మొదట బ్యాటింగ్ చేసిన విండీస్.. రోస్టన్ చేస్ (42 బంతుల్లో 52, 3 ఫోర్లు, 2 సిక్సర్లు), కైల్ మేయర్స్ (34 బంతుల్లో 35, 3 ఫోర్లు, 2 సిక్సర్లు) రాణించడంతో 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 135 పరుగులు చేసింది. సఫారీ బౌలర్లలో షంసీ (3/27), రబాడా (1/11) కరేబియన్లను కట్టడి చేశారు. వర్షం వల్ల దక్షిణాఫ్రికా లక్ష్యం 17 ఓవర్లకు 123 పరుగులకు కుదించగా.. ఆ జట్టు 16.1 ఓవర్లలోనే 7 వికెట్లు కోల్పోయి ఛేదనను పూర్తిచేసింది. ఛేదనలో ఆ జట్టు బ్యాటర్లు క్రమం తప్పకుండా వికెట్లు కోల్పోయినా స్టబ్స్ (27 బంతుల్లో 29, 4 ఫోర్లు), క్లాసెన్ (10 బంతుల్లో 22, 3 ఫోర్లు, 1 సిక్స్), మార్కో జాన్సెన్ (14 బంతుల్లో 21 నాటౌట్, 1 ఫోర్, 1 సిక్స్) సఫారీలను విజయతీరానికి చేర్చారు. బ్యాట్‌తో విండీస్‌ను ఆదుకున్న చేస్ బంతితోనూ (3/12) పోరాడాడు. రస్సెల్ (2/19), అల్జారీ జోసెఫ్ (2/25) రాణించినా వెస్టిండీస్‌కు పరాభవం తప్పలేదు. షంసీకి 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు దక్కింది.

**సంక్షిప్త స్కోర్లు:**
**వెస్టిండీస్:** 20 ఓవర్లలో 135/8 (చేస్ 52, మేయర్స్ 35, షంసీ 3/27, రబాడా 1/11).. **దక్షిణాఫ్రికా:** 20 ఓవర్లలో 124/7 (స్టబ్స్ 29, క్లాసెన్ 22, చేస్ 3/12, రస్సెల్ 2/19)



శ్రీశైలం భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయంలో పూజలు చేసిన మంత్రులు భట్టి, జూపల్లి. ప్యాంట్‌పై పంచె కట్టుకొని దర్శనానికి వచ్చిన భట్టి కుమారుడు

# శ్రీశైలం హైడల్ ప్రాజెక్టుకు మరమ్మతులు

**ఎన్ని నిధులైనా కేటాయిస్తాం.. ప్రతిపాదనలు పంపండి: భట్టి**

- **తక్కువ ఖర్చుతో ఎక్కువ విద్యుదుత్పత్తి చేద్దాం**
- **శ్రీశైలం విద్యుత్తు అధికారుల సమీక్షలో డిప్యూటీ సీఎం**
- **హాజరైన మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యేలు**

అచ్చంపేట, జూన్ 24: శ్రీశైలం జల విద్యుత్తు ప్రాజెక్టు దేశంలోనే అత్యంత గొప్పదని, ఇలాంటి ప్రాజెక్టును కాపాడుకోవడం ప్రజా ప్రభుత్వం బాధ్యత అని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. సోమవారం నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం శ్రీశైలం ఎడమ గట్టు విద్యుత్తు సొరంగంలోని హైడల్ ప్రాజెక్టును ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యేలు వంశీకృష్ణ, మేఘారెడ్డి, రాజేశ్‌రెడ్డి, యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, పర్ణికారెడ్డి, కశిరెడ్డి నారాయణ రెడ్డితో కలిసి ఆయన సందర్శించారు. నాలుగో యూనిట్ గురించి అడిగి వివరాలు తెలుసుకున్నారు. జెన్‌కో అధికారులు ప్రాజెక్టు పూర్తి వివరాలతో కూడిన పవర్ ప్రజెంటేషన్‌ను ఇచ్చారు. అనంతరం విద్యుత్తు శాఖ ఉన్నతాధికారులతో నాలుగో యూనిట్ పునరుద్ధరణ రక్షణ చర్యలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ.. రూ.60 కోట్ల విలువైన విద్యుదుత్పత్తి చేయడానికి రూ.2 కోట్ల ఖర్చు కోసం ఆలస్యం చేయొద్దని సూచించారు. రానున్న మూడు నెలలపాటు వచ్చే వరదతో 60 కోట్ల విద్యుదుత్పత్తిని తయారు చేస్తామని, అందుకోసం వెంటనే పునరుద్ధరణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. నాలుగో యూనిట్ పునరుద్ధరణకు నిధుల కొరత లేదని తెలిపారు. టెండర్ ప్రక్రియను త్వరగా పూర్తి చేసి యూనిట్‌ను రాష్ట్ర ప్రజలకు ఉపయోగపడేలా అధికారులు చర్యలు చేపట్టాలని చెప్పారు. శ్రీశైలం ఎడమగట్టు విద్యుత్తు పవర్‌హౌస్‌లో 2020 సెప్టెంబర్‌లో జరిగిన అగ్ని ప్రమాద ఘటన తీవ్ర బాధాకరమని, వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి ప్రకటించారు.

### మల్లన్న సన్నిధిలో అపచారం

శ్రీశైలంలోని భ్రమరాంబ, మల్లికార్జున స్వామిని మంత్రులు, ఎమ్మెల్యేలు దర్శించుకున్నారు. కానీ భట్టి కుమారుడు ప్యాంట్‌పైనే పంచె కట్టుకొని దర్శనానికి వెళ్లడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మల్లన్న సన్నిధిలో అపచారం అంటూ సోషల్ మీడియాలో భక్తులు ఆవేదనం వ్యక్తం చేశారు.

# 'రక్షణ' భూములు ఇవ్వండి

- **2,450 ఎకరాల భూమి బదలాయించండి**
- **కేంద్ర మంత్రులకు సీఎం రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి**



రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌తో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, జూన్ 24 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌లో రహదారుల విస్తరణ, ఇతర అవసరాల కోసం రక్షణ శాఖకు చెందిన 2,450 ఎకరాల భూములను రాష్ట్ర ప్రభుత్వానికి బదలాయించాలని సీఎం రేవంత్‌రెడ్డి కేంద్రాన్ని కోరారు. ఈ ఆర్థిక సంవత్సరంలో బీఎల్‌సీ మాడల్‌లో తెలంగాణకు 2.70 లక్షల ఇండ్లు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం ఢిల్లీలో పర్యటిస్తున్న రేవంత్‌రెడ్డి సోమవారం రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తోపాటు కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌ను కలిశారు. రాజ్‌నాథ్ సింగ్‌తో మాట్లాడుతూ.. హైదరాబాద్, చుట్టుపక్కల ప్రాంతాల్లో రహదారుల విస్తరణ, ఫ్లైఓవర్ల నిర్మాణం, ఇతర మౌలిక సదుపాయాల కల్పన కోసం రక్షణ శాఖ భూములు అవసరమని చెప్పారు. రావిర్యాల గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన 2,462 ఎకరాల భూములను ఇమారత్ రిసెర్చ్ సెంటర్ (ఆర్‌సీఐ) అవసరాల కోసం కేంద్ర ప్రభుత్వం ఉపయోగించుకుంటున్న విషయాన్ని గుర్తుచేస్తూ.. పరస్పర బదిలీ కింద రక్షణ శాఖకు చెందిన 2,450 ఎకరాల భూములను తెలంగాణకు అప్పగించాలని కోరారు. వరంగల్‌కు సైనిక్ స్కూల్ మంజూరు చేసినా నిర్మాణాలు జరగనందున అనుమతుల గడువు ముగిసిందని తెలిపారు. ఈ నేపథ్యంలో అనుమతుల గడువును పునరుద్ధరించాలని లేదా కొత్తగా మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌తో రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. నిరుపేదలకు వారి సొంత జాగాల్లో 25 లక్షల ఇండ్లు నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని, వాటిలో 15 లక్షల ఇండ్లు పట్టణాభివృద్ధి సంస్థల పరిధిలోకి వస్తాయని తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రధాన మంత్రి ఆవాస యోజన–అర్బన్ (పీఎంఏవై–యూ) కింద ఈ ఏడాది నిధులు పెంచాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు ఇప్పటివరకు 1,59,372 ఇండ్లు మంజూరు చేసిందని, వాటి నిర్మాణం కోసం రూ.2,390.58 కోట్ల గ్రాంటు ప్రకటించినప్పటికీ రూ.1,605.70 కోట్లు మాత్రమే విడుదలయ్యాయని, మిగిలిన వాటిపి వెంటనే విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు.

# ఇక మానవరహిత సబ్‌స్టేషన్లు

- **ఒడిశాలో ఇప్పటికే అమల్లోకి**
- **పరిశీలనకు ఎన్పీడీసీఎల్ బృందం**



ఒడిశాలోని కంటెయినర్ సబ్ స్టేషన్

హనుమకొండ సబర్బన్, జూన్ 24 : వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా విషయంలో గత ప్రభుత్వం తీసుకొన్న విప్లవాత్మక నిర్ణయాలు సత్ఫలితాలను ఇస్తున్నాయి. విద్యుత్ సరఫరా విషయంలో కీలకంగా ఉన్న సబ్ స్టేషన్లను మానవ రహితంగా మార్చేందుకు ఉత్తర మండల విద్యుత్ పంపిణీ సంస్థ(ఎన్పీడీసీఎల్) అడుగులు వేస్తున్నది. టాటా పవర్ లిమిటెడ్ మానవ రహిత విద్యుత్ సబ్‌స్టేషన్ల నిర్వహణను ఇప్పటికే ఒడిశాలో అమలు చేస్తుండగా, ఎన్పీడీసీఎల్ అధికారులు వెళ్లి పూర్తి స్థాయిలో నివేదికను తెప్పించుకున్నారు. పైలట్ ప్రాజెక్టుగా జనగామ జిల్లాలోని నిడిగొండ, చిన్న పెండ్యాల సబ్‌స్టేషన్లలో అమలు చేయనున్నారు. జూలై 5 వరకు వీటిని మానవ రహిత సబ్ స్టేషన్లుగా మార్చే ప్రక్రియకు శ్రీకారం చుట్టనుండగా, పనులను స్కోప్, స్నైడర్ సంస్థలకు అప్పగించారు. కొత్తగా తీసుకొస్తున్న రియల్ టైం మానిటరింగ్ అండ్ కంట్రోలింగ్(ఆర్‌టీఎంఏసీ) సిస్టం ద్వారా సబ్‌స్టేషన్లలో లోడ్‌ను ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చు. ఇప్పటికే టాటా కంపెనీ ఢిల్లీ, రాజస్థాన్‌తోపాటు ఒడిశాలో ఇలాంటి సబ్‌స్టేషన్లను విజయవంతగా నడిపిస్తున్నది. ఇదే జరిగితే వేలాది మంది ఉద్యోగాలకు కోతలు తప్పవని అభిప్రాయపడుతున్నారు.

# మా ఎమ్మెల్యేలను చేర్చుకోలేదా?

**బీఆర్‌ఎస్‌ను ప్రశ్నించిన షబ్బీర్ అలీ**

హైదరాబాద్, జూన్ 24(నమస్తే తెలంగాణ): అధికారంలో ఉన్నప్పుడు తమ పార్టీ ఎమ్మెల్యేలను, ఎమ్మెల్సీలను చేర్చుకోలేదా అని బీఆర్‌ఎస్‌ను ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ ప్రశ్నించారు. ఇప్పుడు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు తమ పార్టీలోకి వస్తుంటే విమర్శించడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ మేరకు ఆయన సోమవారం గాంధీభవన్‌లో మాట్లాడుతూ గతంలో తనకు శాసనమండలిలో, భట్టి విక్రమార్కకు శాసనసభలో ప్రతిపక్షహోదా లేకుండా చేయలేదా? అని ప్రశ్నించారు. కోకాపేటలో బీఆర్‌ఎస్‌కు కేటాయించిన స్థలాన్ని వెనక్కి తీసుకోవాలన్నారు.

### రుణమాఫీ చేస్తాం: కోదండరెడ్డి

రైతులకిచ్చిన మాట ప్రకారం సీఎం రేవంత్‌రెడ్డి రుణమాఫీ చేస్తున్నారని, ఇది కేసీఆర్, కేటీఆర్‌కు ఇష్టం లేనట్టుగా ఉందని కిసాన్ కాంగ్రెస్ జాతీయ ఉపాధ్యక్షుడు కోదండరెడ్డి అన్నారు. గాంధీభవన్‌లో ఆయన మాట్లాడుతూ ప్రతి అంశంలోనూ కేటీఆర్ నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారన్నారు. రైతుభరోసాపై వాస్తవాలు తేల్చేందుకు సబ్ కమిటీ ఏర్పాటు చేస్తే కేటీఆర్‌కు ఇబ్బందేమిటని ప్రశ్నించారు.

# ఉప్పల్ -నారపల్లి ఫ్లైఓవర్ కాంట్రాక్టు రద్దు

- **కొత్తగా టెండర్లకు కేంద్రం ఆదేశాలు**
- **జాతీయ రహదారులుగా 16 రాష్ట్ర రహదారులు**
- **సుముఖంగా కేంద్ర మంత్రి గడ్కరీ**
- **ట్రిపుల్ ఆర్‌పై త్వరలోనే సమీక్ష**
- **మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వెల్లడి**



కేంద్ర మంత్రి బండి సంజయ్‌ను ఆలింగనం చేసుకుంటున్న రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

హైదరాబాద్, జూన్ 24(నమస్తే తెలంగాణ): నత్తనడకన సాగుతున్న ఉప్పల్–నారపల్లి ఫ్లైఓవర్ ప్రస్తుత కాంట్రాక్టును రద్దు చేస్తూ కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ఆదేశాలు జారీ చేసినట్టు రాష్ట్ర ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వెల్లడించారు. సోమవారం ఢిల్లీలో కేంద్రమంత్రి నితిన్ గడ్కరీతో భేటీ అయి వివిధ రోడ్డు పనులపై వినతిపత్రం సమర్పించారు. అనంతరం కోమటిరెడ్డి విలేకరులతో మాట్లాడుతూ , ఉప్పల్ – నారపల్లి ఫ్లైఓవర్ పనులు నిర్వహిస్తున్న సంస్థను టెర్మినేట్ చేసి కొత్త టెండర్లు పిలిచి పనులు పూర్తిచేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్టు చెప్పారు. ప్రాంతీయ రింగురోడ్డు (ట్రిపుల్ ఆర్) కోసం ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేసి సమీక్షిస్తానని గడ్కరీ హామీ ఇచ్చినట్టు తెలిపారు. పెండింగ్‌లో ఉన్న 16 రాష్ట్ర రహదారుల ను జాతీయ రహదారులుగా మార్చే అం శంపై కేంద్రమంత్రి సానుకూలంగా స్పం దించినట్టు చెప్పారు. రహదారుల నిర్మాణానికి అటవీ అనుమతుల కోసం కేంద్ర అటవీ శాఖమంత్రి భూపేంద్ర యాదవ్‌ను కలవనున్నట్టు మంత్రి వెంకట్‌రెడ్డి తెలిపారు. ఎన్నికల కారణంగా ట్రిపుల్ ఆర్, హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారిని 6 లేన్లుగా మార్చే పనులు ఆలస్యం అయినట్టు కోమటిరెడ్డి చెప్పారు.

మరిన్ని వార్తలు ntnews.com లో చూడగలరు




Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.